భారత రాజ్యాంగం - ప్రాథమిక హక్కులు

భారతీయులందరికీ రాజ్యాంగబద్ధంగా హక్కులను కల్పించాలనే వాదన స్వాతంత్ర్యానికి ముందునుంచి ఉన్నప్పటికీ ఆచరణలోకి మాత్రం రాలేదు. ప్రాథమిక హక్కుల ప్రస్తావన మొట్టమొదటగా తిలక్ ''కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా బిల్ - 1895''లో ఉంది. చట్టసమానత్వం, ఆస్తి, భావ ప్రకటన, వ్యక్తి స్వాతంత్ర్యం హక్కులను ప్రతిపాదించిన ఈ బిల్లును హోంరూల్ బిల్లుగా అనిబిసెంట్ అభివర్ణించారు. ఆ తర్వాత వచ్చిన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్ - 1915 జాతి, మత విచక్షణ లేకుండా ప్రభుత్వ సర్వీసుల్లోకి భారతీ యులకు అవకాశం కల్పించింది. ఐతే ఆంగ్లేయులతో సమానంగా భారతీయులకు హోదా కల్పించాలని భారత జాతీయ కాంగ్రెస్ 1917-1919 మధ్య అనేకసార్లు తీర్మానించింది.

1918లో బొంబాయి సమావేశంలో వివిధ రకాల హక్కులు భారతీయులకు ప్రసాదించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. తన (సొంత దేశం ఐర్లాండ్) దేశ పౌరులు కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఐరిష్ ఫ్రీ స్టేట్ చట్టం ద్వారా ప్రాథమిక హక్కులు పొందడంతో స్ఫూర్తి పొందిన అనిబిసెంట్ తన కామన్ వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో ప్రాథమిక హక్కులన్నింటినీ పొందుపరిచింది. 1925లో నేషనల్ కన్వెన్షన్ తుదిరూపునిచ్చిన కామన్ వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లు వచ్చిన రెండేళ్లకే ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్‌ను(సైమన్ కమిషన్)బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ నమూనాను నిర్దేశించడానికి 1927లో జరిగిన కాంగ్రెస్ 43వ వార్షిక సమావేశం భవిష్యత్తు రాజ్యాంగానికి ప్రాథమిక హక్కుల ప్రకటన ఆధారంగా ఉండాలని తీర్మానించింది. ప్రాథమిక హక్కుల ప్రకటన ఆధారంగా ముసాయిదా రాజ్యాంగం తయారీ కోసం 1928 లో మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఓ కమిటీని ఇది ఏర్పాటు చేసింది. భారత ప్రజలకు మొదటగా ప్రాథమిక హక్కులను కల్పించాలని ఈ 'నెహ్రూ రిపోర్ట్‌లో' పేర్కొన్నారు. ఈ రిపోర్ట్‌లో ప్రతిపాదించిన 19 హక్కుల్లో పది హక్కులను 1950 నాటి భారత రాజ్యాంగంలో ప్రవేశపెట్టడం గమనార్హం.

ప్రాథమిక హక్కులు - ప్రాధాన్యం

భారత జాతీయ కాంగ్రెస్ 1931లో కరాచీ తీర్మానాన్ని ఆమోదించడంతో ప్రాథమిక హక్కులకు మరింత గుర్తింపు వచ్చింది. రౌండ్ టేబుల్ సమావేశాల్లో అనేక మంది జాతీయ నాయకులు ప్రాథమిక హక్కులను ప్రస్తావించినప్పటికీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్‌లో వీటికి చోటు కల్పించలేదు. అయితే సమానత్వం, ఆస్తి హక్కులను మాత్రం ఇందులో పొందుపరిచారు. దీని తర్వాత ఆల్ పార్టీస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన తేజ్‌బహదూర్ సప్రూ కమిటీ (1944-45) ప్రాథమిక హక్కుల ఆవశ్యకతను నొక్కిచెప్పింది. 1946 నాటి క్యాబినెట్ మిషన్ కూడా ప్రాథమిక హక్కులకు లిఖితపూర్వకంగా రాజ్యాంగ రక్షణలు ఉండాలని ప్రతిపాదించింది. రాజ్యాంగసభలో ప్రాథమిక హక్కులపై సలహాసంఘం ఏర్పాటును ఇది సిఫార్సు చేసింది.

భారత రాజ్యాంగ రచనకు రాజ్యాంగ సభ ఏర్పాటైన తర్వాత జేబీ కృపలానీ అధ్యక్షతన బీఆర్ అంబేద్కర్, ఎంఆర్ మసాని, కేటీషా, రాజకుమారి అమృతకౌర్, అల్లాడి కృష్ణస్వామి, హరనాంసింగ్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, కేఎం మున్షీ, జైరాందాస్, దౌలత్‌రాం సభ్యులుగా ప్రాథమిక హక్కుల సబ్ కమిటీ ఏర్పాటైంది. రాజ్యాంగ రచనా సమయంలోనే ప్రకటించిన (10 డిసెంబర్ 1948) విశ్వ మానవ హక్కుల ప్రకటన, ఇంగ్లండ్ 'బిల్ ఆఫ్ రైట్స్', అమెరికా 'బిల్ ఆఫ్‌రైట్స్', ఫ్రెంచి విప్లవం నాటి 'డిక్లరేషన్ ఆఫ్ ద రైట్స్ ఆఫ్ మ్యాన్' మొదలైన వాటి ప్రభావం వల్ల భారత రాజ్యాంగం ఆమోదించే నాటికి రాజ్యాంగంలో మూడో భాగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 7 రకాల ప్రాథమిక హక్కులు పౌరులకు ఉన్నాయి. కానీ 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978 ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించారు. ఈ సవరణ జూన్ 20, 1979 నుంచి అమల్లోకి రావడంతో ప్రస్తుతం 6 రకాల హక్కులు మాత్రమే పౌరులకు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక హక్కులను గురించి తెలిపే మూడో భాగంలో ఆర్టికల్ 12 నుంచి 35 వరకు ఉన్నాయి. వీటిలో ఆస్తిహక్కుకు సంబంధించిన ఆర్టికల్ 19(1)f, ఆర్టికల్ 31లను పై సవరణ ద్వారా తొలగించారు. ప్రాథమిక హక్కులకు సంబంధించి పరీక్షల దృష్ట్యా ముఖ్యమైన ఆర్టికల్స్, వివరణలు ఇవీ:

ఆర్టికల్ 12

ఇది రాజ్యం అనే పదాన్ని నిర్వచించింది. దీని ప్రకారం ''రాజ్యం'' అంటే భారత ప్రభుత్వం, భారత పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు, ప్రభుత్వాలు, భారత భూభాగంలోని లేదా భారతప్రభుత్వ ఆధీనంలోని స్థానిక లేదా ఇతర అధికార వ్యవస్థలు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు 'రాజ్యం' నుంచి రక్షణలు పొందొచ్చు. అందుకే 'రాజ్యం' అనే పదం, అర్థం ప్రాథమిక హక్కుల విషయంలో చాలా ముఖ్యమైంది.

ఆర్టికల్ 13

- రాజ్యాంగం అమల్లోకి రాకముందు ఉన్న చట్టాల్లోని ఏదైనా అంశం ప్రాథమిక హక్కుల సంబంధించిన మూడో భాగానికి విరుద్ధంగా ఉన్నట్లైతే చెల్లదు.
- ఈ భాగంలోని హక్కులకు విరుద్ధంగా రాజ్యం ఎటువంటి చట్టం చేయరాదు. ఆ విధంగా చట్టం చేసినా విరుద్ధంగా ఉన్నఅంశాలు చెల్లవు.

- ఈ ఆర్టికల్‌లో చట్టం (లా) అనే పదం కిందకు ఆర్డినెన్స్, ఆర్డర్, బైలా, రూల్, రెగ్యులేషన్, నోటిఫికేషన్, సంప్రదాయం, వాడుకలో ఉన్నపద్ధతులు వస్తాయి.
- ఈ ఆర్టికల్‌లో అంశాలు ఆర్టికల్ 368 ద్వారా రాజ్యాంగాన్ని సవరిస్తే వర్తించవు. (దీన్ని 24వ రాజ్యాంగ సవరణ చట్టం, 1971 ద్వారా చేర్చారు)

ఆర్టికల్ 12 ఏఏ అధికార వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రాథమిక హక్కులను పొందొచ్చో వివరిస్తే, ఆర్టికల్ 13 ప్రాథమిక హక్కుల రక్షణకు చట్టాల పరిధిని నియంత్రిస్తుంది.

ప్రాథమిక హక్కుల విభాగంలో ఆర్టికల్స్ 12, 13లు సాధారణ అంశాల గురించి తెలిపితే ఆర్టికల్ 14 పౌరులకు ఉన్న వివిధ ప్రాథమిక హక్కులను వివరించింది. ఈ హక్కులను కిందివిధంగా విభజించారు.

1. సమానత్వం హక్కు
2. స్వాతంత్ర్యం హక్కు
3. పీడనాన్ని నిరోధించే హక్కు
4. మత స్వాతంత్ర్యం హక్కు
5. సాంస్కృతిక, విద్యావిషయక హక్కు
6. రాజ్యాంగ పరిహార హక్కు

సమానత్వ హక్కు

ఆర్టికల్ 14: చట్టం ముందు సమానత్వం – భారత భూభాగంలోని ఏ వ్యక్తికి కూడా చట్టం ముందు సమానత్వాన్ని, చట్టాల నుంచి సమాన రక్షణను 'రాజ్యం' నిరాకరించరాదు.

సహజ న్యాయ సూత్రాల ఆధారంగా ఏర్పాటు చేసిన ఈ ఆర్టికల్ ప్రకారం సమానమైన పరిస్థితుల్లో చట్టం ముందు వ్యక్తులందరినీ ఒకే విధంగా చూడాలి. దీనిలో 'చట్టం ముందు సమానత్వం' అనే భావన నకారాత్మకమైంది. డైసీ 'రూల్ ఆఫ్ లా' భావన నుంచి గ్రహించిన ఇది ఏ వ్యక్తికి కూడా ప్రత్యేక హక్కులు కల్పించరాదని అందరూ సాధారణ న్యాయానికి లోనై ఉండాలని నిర్దేశిస్తుంది. అయితే దేశాధ్యక్షుడు, గవర్నర్, ఇతర దేశాల రాయబారులకు దీనినుంచి మినహాయింపు ఉంది.

చట్టాల నుంచి సమాన రక్షణ అనే భావన సకారాత్మకమైంది. వ్యక్తికి, మరొక వ్యక్తికి చట్టాల అమల్లో వివక్షత చూపరాదని చెప్పే ఈ భావన భారత పౌరులకు, ఇతర వ్యక్తులకు సమానంగా వర్తిస్తుంది. ఐతే సుప్రీంకోర్టు 'రీజనబుల్ క్లాసిఫికేషన్' అనే భావనను ప్రవేశపెట్టి సహేతుకమైన, ప్రత్యేక సందర్భాల్లో కొందరికి మాత్రమే అమలు అయ్యే చట్టాలు ఏర్పాటు చేయవచ్చని ప్రకటించింది. కొందరు వ్యక్తులకు మాత్రమే ఆదాయ పన్ను అమలు, క్రిస్టియన్ మ్యారేజ్ యాక్ట్, హిందూ మ్యారేజ్ యాక్ట్, వక్ఫ్ యాక్ట్ మొదలైనవి దీనికి ఉదాహరణ.

డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్

రాజ్యాంగం అమల్లోకి రాకముందు ఉన్న చట్టాల్లోని ఏదైనా అంశం ప్రాథమిక హక్కుల భాగానికి విరుద్ధంగా ఉన్నట్లయితే ఆ చట్టం అమల్లోకి రాదు అలాగే రద్దుకూడా కాదు. కానీ విరుద్ధంగా ఉన్న అంశాన్ని సవరించగానే ఆ చట్టం మరల అమల్లోకి వస్తుంది. ఇదే డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్. మధ్యప్రదేశ్ రాష్ట్ర శాసనసభ, మోటార్ ట్రాన్స్‌పోర్ట్‌ను 1950లో రాజ్యాంగం అమల్లోకి రాకముందు జాతీయం చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆర్టికల్ 19(1)(జి) కింద కేసు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వం 1955లో 4వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రాలకు ఆ అధికారం కల్పించింది. సుప్రీంకోర్ట్ డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్ సిద్ధాంతాన్ని అమలు చేస్తూ మధ్యప్రదేశ్ రాష్ట్ర చట్టం సరైందే అని తీర్పునిచ్చింది.

డాక్ట్రిన్ ఆఫ్ సివరబిలిటీ

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చట్టాల్లోని అంశాలు మూడో భాగానికి విరుద్ధంగా ఉంటే, ఆ అంశాలు చెల్లవు. అంటే చట్టంలో అంశాలను ప్రాథమిక హక్కుల భాగానికి అనుగుణంగా ఉన్నవి, విరుద్ధంగా ఉన్నవి అని విడదీసి, వాటిలో విరుద్ధంగా ఉన్నవి మాత్రమే చెల్లవు అని ఈ సిద్ధాంతం తెలుపుతుంది.

డాక్ట్రిన్ ఆఫ్ వేవర్

ఏ భారతీయ పౌరుడు కూడా తనకు గల ప్రాథమిక హక్కులను వదులుకోలేడు అని ఇది తెలుపుతోంది.

ఆర్టికల్ 15:

- పౌరుల మతం, జాతి, కులం, లింగభేదం, జన్మించిన ప్రాంతాల ఆధారంగా రాజ్యం ఎటువంటి వివక్షత చూపరాదు.
- కేవలం పౌరుల మతం, జాతి, కులం, లింగ భేదం, జన్మస్థలాలను అనుసరించి దుకాణాలు, రెస్టారెంట్‌లు, హోటళ్లు, వినోద ప్రదేశాలు లేదా బావులు, చెరువులు, రోడ్లు లేదా ప్రభుత్వ నిధులతో ప్రజల కోసం ఉద్దేశించిన ప్రదేశాల్లోకి అనుమతి నిరాకరించరాదు.
- మహిళలు, బాలలకు రాజ్యం ప్రత్యేక నిబంధనలు ఏర్పాటు చేయవచ్చు.
- రాజ్యం సామాజికంగా, విద్యాపరంగా అణగారినవర్గాల ప్రజలు లేదా షెడ్యూల్డ్ కులాలు, తెగల పురోగతికి ప్రత్యేక నిబంధనలు చేయవచ్చు. (మొదటి రాజ్యాంగ సవరణ చట్టం 1951 ద్వారా దీన్ని రాజ్యాంగంలో చేర్చారు)
- ప్రైవేట్, ఎయిడెడ్ లేదా అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ప్రవేశానికి సామాజికంగా, విద్యాపరంగా వెనుకంజలో ఉన్న వర్గాల ప్రజలు లేదా షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేక నిబంధనలు ఏర్పాటు చేయవచ్చు. (93వ రాజ్యాంగ సవరణ చట్టం 2005 ద్వారా దీన్ని చేర్చారు)

ఆర్టికల్ 14 భారత పౌరులకు, ఇతర వ్యక్తులకు మధ్య సమానత్వాన్ని కల్పిస్తుండగా, ఆర్టికల్ 15 ప్రత్యేక హక్కును భారత పౌరులకు ప్రసాదిస్తోంది. ఆర్టికల్ 15(1), (2)లు పౌరులందరికీ వర్తించే సాధారణ నియమాలను వివరిస్తుంటే, ఆర్టికల్ 15(3), (4), (5)లు మాత్రం ప్రత్యేక మినహాయిం పుల్ని తెలుపుతున్నాయి. మహిళలు, పిల్లలు, సామాజికంగా, విద్యాపరంగా వెనుక ఉన్న వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి ప్రత్యేక మినహాయింపులు కల్పించడం వల్ల దీన్ని సంరక్షణాత్మక వివక్షత(ప్రొటెక్టివ్ డిస్క్రిమినేషన్)గా పిలుస్తారు. ఫ్యాక్టరీ యాక్ట్‌లో మహిళలు రాత్రివేళల్లో పనిపై పరిమితులు విధించడం, బాల కార్మికుల చట్టం ద్వారా ప్రమాదకర పరిశ్రమల్లో వారిని ఉపయోగించుకోవడాన్ని నిషేధించడం వంటివి ఈ సంరక్షణాత్మక వివక్షత కిందకే వస్తాయి.

గ్రూప్-1,2 పరీక్షల్లో భారత రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలపై తప్పనిసరిగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఆర్టికల్స్‌పై పరిజ్ఞానం పెంచుకుంటే మార్కులు పొందటం సులువే.

ఆర్టికల్ 16

ప్రభుత్వోద్యోగాల్లో సమాన అవకాశాల కల్పన

1. ప్రభుత్వ ఉద్యోగాలు లేదా నియామకాల అంశంలో పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.
2. కేవలం మతం, జాతి, కులం, లింగభేదం, వారసత్వం, జన్మస్థలం, నివాసం ఆధారంగా ఏ పౌరుడికీ వివక్ష చూపరాదు.
3. ఏదైనా స్థానిక, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఉద్యోగాల కోసం ఆ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంలో నివసిస్తూ ఉండాలనే నిబంధనను పార్లమెంట్ చేయవచ్చు.
4. సరైన ప్రాతినిధ్యం లేదని భావించిన వెనుకబడిన వర్గాల ప్రజల కోసం ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చు.

4.ఎ. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి ఉద్యోగాల పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చు.

4.బి. ఏదైనా సంవత్సరంలో పూర్తిగా భర్తీకాని రిజర్వుడు కేటగిరి ఉద్యోగాలను తరువాత సంవత్సరంలో భర్తీ చేస్తే ఈ ఉద్యోగాలకు 50 శాతంలోపే రిజర్వేషన్ ఉండాలి అనే నిబంధన పరిధిలోకి రావు. (81వ రాజ్యాంగ సవరణ చట్టం, 2000 ద్వారా ఇది 9 జూన్ 2000 నుంచి అమల్లోకి వచ్చింది.)

5. ఏదైనా మత సంబంధమైన సంస్థల్లో ఉద్యోగాలు పొందాలంటే ఆ వ్యక్తి ఆ మతాన్ని పాటిస్తూ ఉండాలనే నిబంధన విధించవచ్చు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1), 16(2)లు ప్రభుత్వోద్యోగాల నియామకాల్లో పౌరుల మధ్య భేదాన్ని చూపించరాదు అనే సాధారణ నియమాన్ని తెలుపుతుండగా, ఆర్టికల్ 16(3), 16(4), 16(5)లు మినహాయింపులను తెలుపుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వం వెనుకబడిన వర్గాల పౌరులకు ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించడానికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లభించేలా చూడడానికి అవకాశం ఏర్పడింది. అయితే రిజర్వేషన్లు ఒక పరిమితికి లోబడి మాత్రమే ఉండాలని భావించిన సుప్రీంకోర్టు బాలాజి వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు(1963) కేసులో రిజర్వేషన్లు 50% దాటి ఉండరాదని అభిప్రాయపడింది.

ఆర్టికల్ 17

అస్పృశ్యత రద్దు

అస్పృశ్యతను పూర్తిగా నిషేధించారు. అస్పృశ్యతను పాటించడం చట్ట ప్రకారం నేరంగా పరిగణించి శిక్షిస్తారు.

అస్పృశ్యత హిందూ మతానికే మచ్చగా పేర్కొన్న మహాత్మాగాంధీ ఆశయాలు; డా.బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు, ఆచరణలకు నిదర్శనంగా ఈ ఆర్టికల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. దీనికి అనుగుణంగా చేసిన ప్రొటక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్- 1955; షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) యాక్ట్- 1989లు అస్పృశ్యత పాటించినవారికి ఆరు నెలల నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలుశిక్ష, జరిమానాను నిర్దేశిస్తున్నాయి.

ఆర్టికల్ 18

బిరుదుల రద్దు

1. సైనిక, విద్యాపరమైన బిరుదులను మినహా ఇతర బిరుదులను రాజ్యం ప్రకటించరాదు.
2. విదేశీ రాజ్యాల నుంచి ఏ పౌరుడూ బిరుదులను స్వీకరించరాదు.
3. భారతీయ పౌరుడు కానప్పటికీ భారత ప్రభుత్వ సంబంధిత పదవులను నిర్వహిస్తున్నప్పుడు విదేశీ రాజ్యాల బిరుదులను రాష్ట్రపతి అంగీకారం లేకుండా స్వీకరించరాదు.
4. భారత ప్రభుత్వ పదవులు నిర్వహిస్తున్న వ్యక్తులు రాష్ట్రపతి అనుమతి లేకుండా ఇతర రాజ్యాలు ఇచ్చే బహుమతులు, ప్రోత్సాహకాలు, పదవులు అంగీకరించరాదు.

దేశ రక్షణకు పాటుపడే సైనికులు, మేధోశక్తిని పెంపొందించే విద్యార్హతలకు తప్ప ఇతర విషయాల్లో బిరుదులు నిషేధించడం ద్వారా పౌరుల మధ్య కృత్రిమమైన తారతమ్యాలను ఈ ఆర్టికల్ నిషేధిస్తోంది.

స్వాతంత్ర్య హక్కు: రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటిలో ముఖ్యమైంది. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో 19 నుంచి 22 వరకు గల అధికరణలు ఈ హక్కు గురించి తెలుపుతున్నాయి.

ఆర్టికల్ 19

పౌరులందరికీ ఈ హక్కులు ఉన్నాయి

ఎ. వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వాతంత్ర్యం
బి. శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశమయ్యే హక్కు
సి. సంఘాలను లేదా యూనియన్లను ఏర్పాటు చేసుకునే హక్కు
డి. దేశమంతటా స్వేచ్ఛగా తిరిగే హక్కు
ఇ. భారతదేశంలో ఎక్కడైనా నివసించడానికి, స్థిరపడడానికి హక్కు
ఎఫ్. తొలగించారు.

జి. ఏదైనా వృత్తి, వ్యాపారం నిర్వహించుకునే హక్కు

- భారత సార్వభౌమాధికారం, సమైక్యత, శాంతి భద్రతలు, ఇతర దేశాలతో స్నేహ సంబంధాలు, నైతికత, కోర్టు ధిక్కారం, పరువు నష్టం లాంటివి దృష్టిలో పెట్టుకొని ఆర్టికల్ 19 (1)(ఎ), (బి), (సి)లపై సహేతుకమైన నిబంధనలను విధించవచ్చు.
- సాధారణ ప్రజల లేదా షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని ఆర్టికల్ 19(1) (డి) (ఇ)లపై పరిమితులను విధించ వచ్చు.
- వృత్తిపరమైన లేదా సాంకేతికమైన అర్హతలను నిర్దేశించడం, కొన్ని రకాల వృత్తి వాణిజ్యాలను ప్రభుత్వ సంస్థలకే పరిమితం చేయడం ద్వారా ఆర్టికల్ 19 (1)(జి)పై పరిమితులు విధించవచ్చు.

మొదట రాజ్యాంగంలో కల్పించిన 7 హక్కుల్లో ఒకటైన ఆర్టికల్ 19 (1) (ఎఫ్) – ఆస్తిని సంపాదించే, అనుభవించే, వదిలివేసే హక్కును 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978 ద్వారా తొలగించారు. ఇది 20 జూన్ 1979 నుంచి అమల్లోకి వచ్చింది. ఇదే సవరణ ద్వారా రాజ్యాంగంలోని 12వ భాగంలో నాలుగో చాప్టర్‌లో ఆర్టికల్ 300 – ఎ ను చేర్చి చట్టప్రకారం తప్పమరే విధంగా వ్యక్తులకు ఆస్తిని నిరాకరించరాదని పేర్కొన్నారు. పైన పేర్కొన్న హక్కులకు విధించిన పరిమితుల్లో భాగంగానే వ్యాపారాలకు లైసెన్సు విధానాన్ని ప్రవేశపెట్టడం, ఇన్‌ఫ్లక్స్ ఫ్రం పాకిస్తాన్(కంట్రోల్) యాక్ట్, 1949; అన్‌లాఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్, 1967 మొదలైన వాటిని అమలు చేశారు.

ఆర్టికల్ 20

నేరాలకు శిక్ష విధించే విషయంలో రక్షణలు

1. ఏ వ్యక్తిని అయినా అప్పటికి అమల్లో ఉన్న చట్టాన్ని అతిక్రమించినట్లయితేనే, ఆ చట్ట పరిమితికి లోబడి శిక్షించాలి.
2. ఒకే నేరానికి ఎవ్వరినీ రెండుసార్లు శిక్షించరాదు.
3. ఏ వ్యక్తిని కూడా ఏ నేరం లోనైనా అతనికి వ్యతి రేకంగా సాక్ష్యం ఇవ్వమని నిర్బంధించరాదు.

అప్పటికే చేసిన పనులకు శిక్ష విధించడం లేదా శిక్షను పెంచడాన్ని చేసే చట్టాన్ని 'ఎక్స్‌పోస్ట్‌ఫాక్టోలా' అంటారు. ఈ ఆర్టికల్ ద్వారా ఇటువంటి చట్టాల నుంచి వ్యక్తులకు రక్షణ కల్పించారు. అయితే ఈ ఆర్టికల్ ద్వారా లభించే రక్షణ సివిల్ చట్టాలు, ప్రివెంటివ్ డిటెన్షన్‌కు మాత్రం వర్తించదు.

ఆర్టికల్ 21

జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛలకు రక్షణ

న్యాయ ప్రకారం ఏర్పాటు చేసిన విధానం ద్వారా కాకుండా మరే విధంగా కూడా వ్యక్తి జీవితాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను భంగపరచరాదు.

ఆర్టికల్ 21 (ఎ) – విద్యాహక్కు:

ఆరు నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను ప్రభుత్వం అందించాలి. (86వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002 ద్వారా దీన్ని రాజ్యాంగంలో చేర్చారు.)

ఆర్టికల్ 22

అరెస్టు, నిర్బంధాల నుంచి ప్రత్యేక సందర్భాల్లో రక్షణ

1. అరెస్టైన వ్యక్తికి అందుకు కారణాలు తెలపడంతో పాటు న్యాయ సహాయం పొందడానికి వీలు కల్పించాలి.
2. అరెస్టు చేసిన 24 గంటల్లోగా దగ్గరలోని మెజిస్ట్రేటు ముందు ఆ వ్యక్తిని హాజరు పరచాలి.
3. పైన పేర్కొన్న నిబంధనలు ఇతర దేశాల శత్రువులు, ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టైన వ్యక్తులకు వర్తించవు.
4. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సలహా సంఘం సిఫార్సు మేరకు తప్ప వేరే ఏ సందర్భంలోనూ ప్రివెంటివ్ డిటెన్షన్ కింది అరెస్టైన వ్యక్తిని మూడు నెలల కన్నా ఎక్కువ కాలం పాటు నిర్బంధించ రాదు.

పాస్‌పోర్టు కేసు (మేనకా గాంధీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా), 1978

పాస్‌పోర్టు చట్టం 1967లోని సెక్షన్ 10 (3) ప్రకారం 'సాధారణ ప్రజల ప్రయోజనాల కొరకు' అనే కారణం చూపి ఆనాటి జనతా పార్టీ నాయకురాలైన మేనకా గాంధీ పాస్‌పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆమె విదేశీ ప్రయాణాన్ని నిరాకరించింది. ఆర్టికల్ 21 ప్రకారం జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛలను పరిరక్షిస్తూ 11 మంది న్యాయ మూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మేనకాగాంధీకి అనుకూలంగా తీర్పునిచ్చింది.

ఆసియాడ్ గేమ్స్ కేసు (పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా), 1982

ఆసియాడ్ గేమ్స్ నిర్వహించడం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి పనులను పొందిన కాంట్రాక్టర్లు కొందరు అతి తక్కువ వేతనాలతో కనీస భోజన సదుపాయాలు కూడా కల్పించకుండా పని చేయించుకుంటున్నారని స్వచ్ఛంద సంస్థ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆర్టికల్ 21 ప్రకారం జీవించడం అంటే 'మానవ సంబంధమైన గౌరవంతో జీవించడం' అని పేర్కొంటూ వారి జీతభత్యాలను పెంచాలని ఆదేశించింది.

డెహ్రాడూన్ క్వారీయింగ్ కేసు (రూరల్ లిటిగేషన్ అండ్ ఎంటైటిల్‌మెంట్ కేంద్రం వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్) 1988

సమాజంలోని కొన్ని పేరొందిన వర్గాల వ్యక్తులు అక్రమ మార్గాల్లో అనుమతులు సంపాదించి మైనింగ్ చేపట్టడం ద్వారా పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని ఇది ప్రాథమిక హక్కుల్లోని ఆర్టికల్ 14, 15, 19లకు విరుద్ధమని సుప్రీంకోర్టు ఈ కేసులో పేర్కొంది. ప్రస్తుత

తరాలు తాము అనుభవిస్తున్న జీవన ప్రమాణాలను తర్వాత తరా లకూ అందించాలని, భవిష్యత్ తరాల వారికి ఆర్టికల్ 14 ప్రకారం ఆ హక్కు ఉందని తెలిపింది. 'డాక్ట్రిన్ ఆఫ్ ఇంటర్ జనరేషన్స్ ఈక్వాలిటీ' అనే భావన ద్వారా వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించడానికి సుప్రీంకోర్టు వీలు కల్పించింది.

భారత రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు

పీడనాన్ని నిరోధించే హక్కు:

పరపీడనా నివారణ హక్కును రాజ్యాంగంలోని ఆర్టికల్ 23, 24లు కల్పిస్తున్నాయి.

ఆర్టికల్ 23-వెట్టిచాకిరి నిషేధం:

1. వ్యక్తులతో నిర్బంధంగా చాకిరి చేయించడం (బేగార్), పడుపు వృత్తి నిషేధం
2. ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం నిర్బంధ సేవను విధించ వచ్చు. ఇది కుల, మత, జాతి, వర్గ భేదాలకు అతీతంగా ఉండాలి. కనీస వేతనాలు కూడా చెల్లించకుండా పనులు, సేవలను పొంద డాన్ని వెట్టిచాకిరిగా చెప్పొచ్చు. ఈ ఆర్టికల్‌కు అనుగుణంగా చేసిన వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం 1976 వెట్టిచాకిరి చేయించు కునే వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానాలను విధిస్తోంది.

ఆర్టికల్ 24

కర్మాగారాల్లో బాలకార్మికుల నిషేధం:

14 ఏళ్లలోపు వయసు పిల్లలను కర్మాగారాలు, మైనింగ్, ప్రమాదకర పరిశ్రమల్లో పనిలో నియమించరాదు. రాజ్యాంగంలోని ఈ అధిక రణానికి అనుగుణంగా రూపొందించిన బాల కార్మికుల నిషేధ చట్టం 1986, ఫ్యాక్టరీల చట్టం 1948లోని సెక్షన్ 67లు 14 ఏళ్లలోపు బాలల కు తగిన రక్షణలు కల్పిస్తున్నాయి.

మతస్వాతంత్ర్య హక్కు:

ప్రాథమిక హక్కుల్లో మరొక ముఖ్యమైన ఈ హక్కును రాజ్యాం గంలోని 25 నుంచి 28 వరకు గల అధికరణాల్లో పేర్కొన్నారు. రా జ్యాంగం మతాన్ని, లౌకికత్వాన్ని నిర్వచించకపోయినప్పటికీ భారత దేశాన్ని లౌకిక దేశంగా ప్రకటిస్తోంది.

ఆర్టికల్ 25

మతాన్ని ఆచరించడం, ప్రచారం చేసుకునే హక్కు:

1) శాంతి భద్రతలు, నైతిక విలువలు, ఆరోగ్యం, ఇతర ప్రాథమిక హక్కులకు లోబడి ప్రతి వ్యక్తీ తనకు నచ్చిన మతాన్ని ప్రబోధిం చడం, పాటించడం, ప్రచారం చేసుకునే హక్కుంది.
2) అప్పటికే ఉన్న చట్టాల అమలు, కొత్త చట్టాల తయారీని ఈ ఆర్టికల్ ద్వారా నిరోధించలేం.

ఎ) మత ఆచారాలకు అనుబంధంగా ఉన్న ఏదైనా ఆర్థిక, రాజకీయ లేదా లౌకిక కార్యాలను నియంత్రించవచ్చు.

బి) సామాజిక సంస్కరణలు, హిందువులందరికీ హిందూ సంస్థలను అందుబాటులోకి తేవడం కోసం చట్టాలు చేయవచ్చు.

ఈ అధికరణానికి ఇచ్చిన వివరణల్లో సిక్కులు ''కిర్‌పాణ్''(కత్తి) ధరించడం సిక్కు మతాన్ని అవలంబించడంగా వస్తుందని, పై సబ్‌క్లాజ్(బి)లో పేర్కొన్న హిందువులు అనే పదంలో సిక్కులు, జైనులు, బౌద్ధులు కూడా ఇమిడి ఉన్నారని వివరించారు.

ఆర్టికల్ 26

మత విషయాలను నిర్వహించుకునే స్వాతంత్ర్యం:

శాంతి భద్రతలు, నైతిక విలువలు, ఆరోగ్యం అనే నిబంధనలకు లోబడి ప్రతీ మతం, దానిలోని అన్ని వర్గాల ప్రజలకు కింది హక్కులు ఉన్నాయి.

ఎ) మతపరమైన, దాతృత్వపరమైన విషయాల కోసం సంస్థలను ఏర్పాటు చేసుకోవడం, నిర్వహించడం.
బి) మత వ్యవహారాల్లో స్వంత విషయాలను నిర్వహించుకోవడం
సి) ఆస్తిని కలిగి ఉండటం, సమకూర్చుకోవడం
డి) ఆస్తిని చట్టాలకు లోబడి నిర్వహించుకోవడం

ఆర్టికల్ 27

మతపరమైన పన్నుల నుంచి స్వాతంత్ర్యం:

ఏదైనా మత నిర్వహణ కోసం సేకరించిన నిధులపై పన్నులు చెల్లించ మని ఏ వ్యక్తినీ నిర్బంధించరాదు.

ఆర్టికల్ 28

విద్యాసంస్థల్లో మతపరమైన ఆరాధనల నుంచి స్వాతంత్ర్యం:

1) ప్రభుత్వ నిధులతో నిర్వహించే విద్యాసంస్థల్లో మత బోధనలు చేయరాదు.
2) మత బోధనల కోసం ఏర్పాటైన లేదా ఏదైనా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు ప్రభుత్వ నిధులు లభించినప్పటికీ పై నిబంధన వర్తించదు.
3) ప్రభుత్వం గుర్తించిన లేదా ప్రభుత్వం నుంచి సహాయం పొందు తున్న విద్యాసంస్థల్లో మతపరమైన ప్రార్థనలకు హాజరవమని ఏ వ్యక్తినీ నిర్బంధించరాదు.

సాంస్కృతిక, విద్యా విషయక హక్కులు:

ఆర్టికల్ 29

అల్పసంఖ్యాక వర్గాల ప్రయో జనాల పరిరక్షణ:

1) భారత భూభాగంలో నివసిస్తున్న పౌరులు వాళ్లకున్న ప్రత్యేక భాష, లిపి లేదా సంస్కృతులను పరిరక్షించుకునే హక్కుంది.

2) ప్రభుత్వం నిర్వహిస్తున్న లేదా ప్రభుత్వ సహాయం పొందుతున్న విద్యాసంస్థల్లో ఏ పౌరుడికీ కేవలం మతం, జాతి, కులం, భాష ఆధారంగా ప్రవేశం నిరాకరించరాదు.

ఆర్టికల్ 30

అల్పసంఖ్యాక వర్గాల వారు విద్యా సంస్థలు నిర్వహించుకునే హక్కు:

1) మత లేదా భాషాపరమైన అన్ని అల్పసంఖ్యాక వర్గాల వారికీ తమకు నచ్చిన విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకుని నిర్వహించుకునే హక్కు ఉంటుంది.

1ఎ) పై విధమైన మైనారిటీ విద్యాసంస్థల ఆస్తులను తప్పనిసరిగా సేకరించాల్సి వచ్చినపుడు వారికి నష్టం వాటిల్లని రీతిలో పరిహారం అందించాలి. (దీన్ని 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978 ద్వారా చేర్చారు. ఇది జూన్ 20, 1979 నుంచి అమల్లోకి వచ్చింది)

2) ప్రభుత్వం విద్యాసంస్థలకు నిధులను అందించే సమయంలో కేవలం అల్పసంఖ్యాక వర్గాలకు చెందినవి అనే కారణంతో ఎటువంటి వివక్షత చూపరాదు.

ప్రాథమిక హక్కులు – సుప్రీంకోర్టు తీర్పులు

1) దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, 1983: ఈ కేసులో సుప్రీంకోర్టు ఉరిశిక్ష అనేది చట్టం ఏర్పాటు చేసిన నిబంధన ప్రకారం ఉంది కాబట్టి ఆర్టికల్ 14, 19, 21లకు వ్యతిరేకం కాదని పేర్కొంది. ఆర్టికల్ 21 ఉరిశిక్షను నిషేధించడం లేదు కానీ అది క్రూరంగా, అనాగరికంగా ఉండరాదని అభిప్రాయపడింది.

2) మిత్తు వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్, 1983:

ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 303, సెక్షన్ 302ల మధ్యఉన్న అంతరంపై విచారించిన సుప్రీంకోర్టు సెక్షన్ 303ను రద్దు చేసింది. యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఖైదీ హత్య చేసినట్లయితే అతనికి తప్పనిసరిగా ఉరిశిక్ష విధించాలని సెక్షన్ 303 పేర్కొంటోంది. కానీ సెక్షన్ 302 ప్రకారం ఏదైనా వ్యక్తి హత్య చేసినపుడు కోర్టు విచక్షణను ఉపయోగించి యావజ్జీవ శిక్షను లేదా ఉరిశిక్షను విధించవచ్చు. ఈ విధమైన అంతరం ఆర్టికల్ 14, 21లకు వ్యతిరేకమని ఈ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఉరిశిక్ష పడిన వ్యక్తికి తన చివరి శ్వాస వరకు ఆర్టికల్ 21 కింద అన్ని నిబంధనలు సక్రమంగా అమలు చేయాల్సిందేనని, ఆ వ్యక్తి ఆర్టికల్ 72 కింద రాష్ట్రపతికి చేసుకునే క్షమాభిక్ష పిటిషన్‌ను నిర్ధారిత సమయంలో పరిష్కరించాలని, ఒకవేళ ఆలస్యమయితే తలెత్తే మానసిక క్షోభ ఆర్టికల్ 21 ప్రకారం గల హక్కుకు భంగం కలిగిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది.

3) ఎస్.పి. మిత్తై వర్సెస్ యూనియన్ ఆఫ్‌ఇండియా, 1983 (ఆరబిందో సొసైటీ కేసు):

పాండిచ్చేరిలోని ఆరోవిల్లి ఆశ్రమంలో శ్రీ అరబిందుని బోధనలను, ఆశయాలను ప్రచారం చేయడానికి ఇంటర్నేషనల్ కల్చరల్ టౌన్‌షిప్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఈ సొసైటీ నిర్వాహకులు అనేక చట్ట వ్యతిరేకమైన పనులు చేశారని ప్రభుత్వం భావించింది. దీనిలో కేంద్ర ప్రభుత్వం ఆరోవిల్లి అత్యవసర నిబంధనల చట్టం, 1980ను చేసి ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకుంది. ఆర్టికల్ 29కు వ్యతిరేకమని ఈ చర్యలు వ్యతిరేకమని పేర్కొంటూ సొసైటీ నిర్వాహకులు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వ చర్య సరైనదేనని, ఆరోవిల్లి లేదా సొసైటీ అనేది మతపరమైన సంస్థ కాదని కోర్టు తీర్పునిచ్చింది.

4) డి.ఎ.వి. కాలేజ్, భటిండ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్, 1971

పంజాబ్ యూనివర్సిటీ కేవలం గురుముఖ లిపిలోనే విద్యాబోధన ఉండాలని చేసిన నిబంధనను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ యూనివర్సిటీ, అనుబంధ కళాశాల్లోని మైనారిటీల హక్కులకు ఇది విరుద్ధమని పేర్కొంది.

5) బిజోయ్ ఇమ్మాన్యూయెల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ, 1986

జాతీయగీతం పాడటం తమ మతానికి విరుద్ధమని భావించిన ఒక వర్గం వారు కేరళ ప్రభుత్వ ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేశారు. వరుసలో నిల్చొని ఉండటం ద్వారా జాతీయ గీతాన్ని గౌరవించారని, కాబట్టి వారు తప్పనిసరిగా పాడాలని నిర్బంధించడం సరికాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

6) 1992లో ఉన్ని కృష్ణన్ కేసులో తీర్పునిస్తూ సుప్రీంకోర్టు 14 ఏళ్ల లోపు వారు విద్య పొందడం అనేది జీవించే హక్కులో ఇమిడిఉన్న ఉపప్రాథమిక హక్కుగా పేర్కొంది.

7) ప్రభాకరన్ నాయర్ కేసులో తీర్పునిస్తూ న్యాయస్థానం ఆవాస హక్కును కూడా ప్రాథమిక హక్కుగా పేర్కొంది.

8) దినేష్ త్రివేది కేసులో తీర్పునిస్తూ.. పౌరులకు ప్రభుత్వ విషయాలు తెలుసుకునే హక్కు ఉందని ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

9) విదేశాలకు పోయే హక్కు అధికరణం 21లో ఇమిడిఉన్న హక్కు అని సత్యంత్ సింగ్ కేసులో న్యాయస్థానం తెలిపింది.

10) స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ మహిందర్ సింగ్ చావ్లా కేసులో కూడా సుప్రీంకోర్టు జీవించే హక్కులో ఆరోగ్య హక్కు కూడా ఉందని స్పష్టం చేసింది.

నమూనా ప్రశ్నలు

1. రాజ్యాంగం 'ఆధారభూత సంరచన' సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రతిపాదించింది? (ఎ.ఇ.ఇ.-2007)

ఎ) మినర్వామిల్స్ బి) గోలక్‌నాథ్

సి) కేశవానంద్ భారతి

డి) గోపాలన్, మద్రాస్ రాష్ట్రాల మధ్య

2. అంటరానితనాన్ని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్/నిబంధన కింద ప్రభుత్వం నిషేధించింది?

(ఎ.ఇ.ఇ.-2007)

ఎ) ఆర్టికల్ 16 బి) ఆర్టికల్ 17

సి) ఆర్టికల్ 18 డి) ఆర్టికల్ 20

3. స్వేచ్ఛాహక్కు హామీ ఎన్ని హక్కులకు వర్తిస్తుంది?

(గెజిటెడ్-2006)

ఎ) ఆరు బి) ఏడు సి) ఎనిమిది డి) తొమ్మిది

4. భారత రాజ్యాంగం ప్రకారం కింద పేర్కొన్న వాటిలో ఏది మౌలిక మైన హక్కు కాదు? (సబ్‌ఇన్‌స్పెక్టర్-2008)

ఎ) సహవాసం చేయు బి)హక్కు, భావప్రకటన

సి) ఉచిత, నిర్బంధ విద్య డి) చలన హక్కు

5. భారత రాజ్యాంగంలో 'మాగ్నాకార్టా'గా పిలిచే భాగం?

(ఎఫ్.ఆర్.ఓ.-2005)

ఎ) పార్ట్ - I బి) పార్ట్ - II

సి) పార్ట్ - III డి) పార్ట్ - IV

6. కింది వాటిలో ఏ ఆర్టికల్ వార్తాపత్రికల స్వేచ్ఛను పరిరక్షిస్తుంది?

(డి.ఇ.ఓ.-2008) (ఎఫ్.ఆర్.ఓ-2005)

ఎ) 16 బి) 19 సి) 22 డి)పైమేమీ కాదు

7. భారత పౌరుల ప్రాథమిక హక్కులు?

(వాటర్ వర్క్స్ మేనేజర్-2009)

ఎ) రాజ్యాంగంలో మొదట పొందుపరచి ఉన్నవి

బి) 42వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించినవి

సి) 44వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించినవి

డి) 1952 పార్లమెంట్ చట్టం ద్వారా రూపొందించినవి

8. ప్రాథమిక హక్కుల చాప్టర్‌లో సాంస్కృతిక, విద్యాహక్కుల వెనుక దాగి ఉన్న ఉద్దేశం? (ఎ.పి.ఆర్.ఓ.-2008)

ఎ) నిరక్షరాస్యతను రూపుమాపటం

బి) ఒకే ఒక్క సంస్కృతిని రూపొందించటం

సి) అల్పసంఖ్యాక వర్గాల సంస్కృతి సంరక్షణకు సహాయపడటం

డి) భారతదేశ సంస్కృతి సంరక్షణకు సహాయపడటం

సమాధానాలు:

1) సి 2) బి 3) ఎ 4) సి 5) సి 6) బి 7) ఎ 8) సి

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంపై అవగాహనలో ప్రాథమిక హక్కుల్లోని కొంతభాగం వరకు గత సంచికల్లో తెలుసుకున్నాం. ప్రాథమిక హక్కుల్లోని చివరి అంశాలను ఈ వ్యాసంలో చర్చిద్దాం.

ఆస్తిహక్కు

ఆర్టికల్ 31లోని 'ఆస్తిహక్కు' అనే ఉపశీర్షికను 44వ రాజ్యాంగ సవరణ చట్టం (1978) ద్వారా 20 జూన్, 1979 నుంచి తొలగించి రాజ్యాంగంలోని 12వ భాగంలో నాల్గో చాప్టర్‌లో ఆర్టికల్ 300ఎ గా చేర్చారు.

మినహాయింపు చట్టాలు:

ఆర్టికల్ 31ఎ ప్రకారం దిగువ పేర్కొన్న చట్టాలు ఆర్టికల్ 14 లేదా 19లకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆర్టికల్ 13 (న్యాయసమీక్ష) ద్వారా చెల్లవు అని చెప్పరాదు.

ఎ) ఏదైనా ఎస్టేట్ (జాగీరు, ఇనాం లేదా ముఫ్‌సి)ను లేదా దానికి సంబంధించిన హక్కులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే చట్టం

బి) ఏదైనా ఆస్తిని తాత్కాలికంగా ప్రజాప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకునే చట్టం

సి) రెండూ లేదా అంత కంటే ఎక్కువ కార్పొరేషన్ల విలీన చట్టం

డి) ఏదైనా కార్పొరేషన్ వాటాదారులు, డైరక్టర్లు, సెక్రటరీలు, ఏజెంట్ల హక్కుల రద్దులేదా సవరణ చట్టం

ఇ) ఖనిజాలు లేదా ఖనిజ నూనెలకు సంబంధించిన ఒప్పందాలు, లీజులు, లైసెన్సులు ఏ సమయంలోనైనా రద్దుచేసే చట్టం

ఆర్టికల్ 31బి ప్రకారం 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నాయి కాబట్టి చెల్లవు అని చెప్పరాదు.

ఆర్టికల్ 31సి ప్రకారం ఆదేశిక సూత్రాల అమలుకు చేసే చట్టాలు ఆర్టికల్ 14 లేదా ఆర్టికల్ 19లకు విరుద్ధంగా ఉన్నాయని, అవి చెల్లవని చెప్పరాదు. ఏదైనా రాష్ట్రం ఇలాంటి చట్టం చేస్తే.. దానిని రాష్ట్రపతి ఆమోదించాలి. అప్పుడే ఈ ఆర్టికల్ ద్వారా ఆ చట్టాలకు రక్షణ లభిస్తుంది.

రాజ్యాంగ పరిహార హక్కు

ఆర్టికల్ 32–ప్రాథమిక హక్కుల భాగంలో పేర్కొన్న అమలుకు రక్షణ

1. ప్రాథమిక హక్కుల అమలుకు తగిన పద్ధతిని అనుసరించి సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కు ఉంది.
2. ప్రాథమిక హక్కుల అమలుకు సుప్రీంకోర్టు హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కోవారెంటో, సెర్షియోరరీ రిట్లతో సహా ఇతర రిట్లను, ఆదేశాలను, నిర్దేశకాలను జారీ చేయవచ్చు.
3. సుప్రీంకోర్టుకున్న ఈ అధికారాన్ని దేశంలోని ఇతర న్యాయస్థానాలకు వాటి పరిధికి లోబడి కల్పించే అధికారం పార్లమెంట్‌కు ఉంది.
4. రాజ్యాంగం పేర్కొన్న విధంగా కాకుండా మరే రకంగానూ ఈ హక్కును తాత్కాలికంగానైనా నిలిపివేయరాదు.

ఆర్టికల్ 32, 226ల ప్రకారం చేసే న్యాయసమీక్ష రాజ్యాంగ మౌలిక లక్షణంగా సుప్రీంకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సందర్భంలోనే రిట్లను ఈ ఆర్టికల్ ద్వారా జారీ చేస్తుంది. ఏదైనా రాజ్యాంగ సవరణను అమలు చెయమని లేదా చట్టాన్ని చేయమని ప్రభుత్వాన్ని ఆదేశించలేదు. ప్రభుత్వ అధికారులు ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని భావిస్తే కోర్టు కమిషనర్‌ను నియమించి విచారణ జరిపించవచ్చు. ఆర్టికల్ 32 కింద కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించకపోతే కోర్టుధిక్కార నేరం మోపి శిక్ష లేదా జరిమానా విధించవచ్చు.

ఆర్టికల్ 33:

హక్కుల అమల్లో రక్షణ రంగంలోని వారికి పార్లమెంట్ పరిమితులు విధించవచ్చు. క్రమశిక్షణ, వారి విధులను సక్రమంగా నిర్వహించేలా చూడటానికి సైనిక దళాలు, శాంతి భద్రతలు, ఇంటెలిజెన్స్, సైనిక దళాల టెలికమ్యూనికేషన్ తదితర రంగాల్లో పనిచేసే వారి హక్కులను పార్లమెంట్ నియంత్రించవచ్చు.

ఆర్టికల్ 19 ప్రకారం తమకున్న సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కుకు వ్యతిరేకంగా పోలీస్ ఫోర్సెస్ (రిస్ట్రిక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్ 1966 ఉందని, దాన్ని రద్దు చేయాలని ఢిల్లీ పోలీస్ సంఘ్ ధాఖలు చేసిన కేసులో.. ఆర్టికల్ 33 ప్రకారం పార్లమెంటుకు ఆ ప్రాథమిక హక్కులను నియంత్రించే ప్రత్యేక అధికారం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఆర్టికల్ 34:

మార్షల్‌లా విధించిన ప్రాంతాల్లో ప్రాథమిక హక్కుల అమలును పార్లమెంట్ తగిన చట్టం ద్వారా నియంత్రించడానికి ఈ ఆర్టికల్ వీలు కల్పిస్తోంది. అయితే మార్షల్‌లా విధించగానే హక్కులు రద్దు కావు. తగిన చట్టాన్ని పార్లమెంట్ చేయాల్సి ఉంటుంది. అయితే రాజ్యాంగంలో మార్షల్ లా విధించడానికి ప్రత్యేక నిబంధన ఏదీ ఏర్పాటు చేయలేదు.

ఆర్టికల్ 35-ప్రాథమిక హక్కుల అమలుకు చట్టాల రూపకల్పన:

1. ఆర్టికల్ 16, 32, 33, 34లకు సంబంధించిన కొన్ని అంశాల్లో, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు సంబంధించి శిక్షలు నిర్దేశించడంలో కేవలం పార్లమెంట్ మాత్రమే చట్టాలు చేయొచ్చు.
2. ప్రాథమిక హక్కుల రక్షణకు ఉపయోగపడే చట్టాలు రాజ్యాంగం అమల్లోకి రాకముందు నుంచి ఉన్నట్లయితే.. అవి రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా తగిన సవరణలతో కొనసాగుతాయి.

ఉన్నత న్యాయస్థానాలు - రిట్లు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్)

నాలుగు వందల ఏళ్ల నుంచి కొన్ని ప్రత్యేక ఆజ్ఞలు జారీచేసే అధికారం బ్రిటిష్ రాజ్యాధినేత ఉంది. రెగ్యులేటింగ్ చట్టం-1773 ద్వారా ఈ ప్రత్యేక ఆజ్ఞలను జారీచేసే అధికారాన్ని ఆనాటి కలకత్తా సుప్రీంకోర్టుకు కల్పించారు. అదేవిధంగా ఇండియన్ హైకోర్టు చట్టం-1861 ద్వారా భారతదేశంలోని హైకోర్టులకు కల్పించారు.

కలకత్తాలోని సుప్రీంకోర్టును తర్వాత ఫెడరల్ కోర్టుగా, ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియాగా మార్చిన సందర్భంలో రిట్లను జారీచేసే అధికారాన్ని సుప్రీంకోర్టు, హైకోర్టులకు రాజ్యాంగ నిర్మాతలు కల్పించారు. రిట్లను జారీ చేయమని కోరడానికి సరళ పద్ధతులు లేవు. ఆదేవిధంగా బాధితులు కోరితేనే మూడో భాగంలోని ప్రాథమిక హక్కుల కోసం మాత్రమే జారీచేసే వీలుండటం వల్ల పబ్లిక్ ఇంటరాక్ట్ లిటిగేషన్ (పిల్) అనే భావన మన దేశంలో అంకురించింది. అమెరికాలోని పబ్లిక్ ఇంటరెస్ట్ లాను పోలిన ఈ పిల్‌ను ప్రజా ప్రయోజనాల కోసం ఎవరైనా దాఖలు చేసే వీలుంది. అందుకే దీన్ని సోషల్ ఆక్షన్ లిటిగేషన్‌గా ప్రొఫెసర్ ఉపేంద్ర బక్షి పేర్కొన్నారు.

రిట్లు..

ఏదైనా వ్యక్తి లేదా సంస్థకు ఆదేశాలు జారీచేయడం లేదా ఒక పనిని నిర్వహించమని లేదా నిలిపివేయమని ఉన్నత న్యాయస్థానాలు తమ అధికారిక ముద్రతో కూడిన లిఖిత పత్రం ద్వారా నిర్దేశించడాన్నే.. రిట్లు జారీ చేయడం అంటారు. ఈ అధికారాన్ని ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టుకు, ఆర్టికల్ 226 ద్వారా హైకోర్టుకు రాజ్యాంగం కల్పించింది. అయితే ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టును ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ఆశ్రయించడం మాత్రమే ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారు. కానీ ఆర్టికల్ 226 ద్వారా ప్రాథమిక హక్కుల రక్షణ లేదా మరే ఇతర విషయాల్లో నైనా హైకోర్టు రిట్లు జారీ చేయవచ్చు. ఇది కేవలం హైకోర్టు విచక్షణాధికారం మాత్రమే కానీ ప్రాథమిక హక్కు కాదు. రాజ్యాంగంలో ముఖ్యమైందిగా, రాజ్యాంగపు హృదయంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్టికల్ 32ను పేర్కొన్నారు. ఇందులో ఐదు రకాల రిట్లు ఉన్నాయి.

1. హెబియస్ కార్పస్:

పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించడంలో ఈ రిట్ ముఖ్యమైంది. తగిన అధికారం లేకుండా వ్యక్తిని నిర్బంధించినప్పుడు ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరు పరచమని అతని సన్నిహితులు ఎవరైనా ఈ రిట్ ద్వారా ఆశ్రయించొచ్చు.

2. మాండమస్:

'ఆదేశించడం' అనే అర్థం ఉన్న ఈ రిట్ ద్వారా ప్రాథమిక హక్కులకు భంగం కలిగినపుడు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేస్తుంది. చట్టపరమైన విధిని నిర్వహించడంలో ఏదైనా ప్రభుత్వ సంస్థ వైఫల్యం చెందినపుడు మాత్రమే దీని ద్వారా న్యాయం కల్పించవచ్చు. ప్రభుత్వాన్ని ఏదైనా చట్టం చేయమని లేదా ప్రైవేట్ సంస్థలపై ఈ రిట్‌ను ఉపయోగించడం సాధ్యం కాదు.

3. సెర్షియోరరి:

ఈ లాటిన్ పదానికి ధ్రువీకరించడమని అర్థం. దిగువ న్యాయస్థానాలు తమ అధికార పరిధిని దాటి, సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా ప్రవర్తించి, ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తే.. ఉన్నత న్యాయస్థానాలైన హైకోర్టు, సుప్రీంకోర్టులు ఈ రిట్ ద్వారా దిగువ న్యాయస్థానాల ఆదేశాలను సరిచేయడం లేదా రద్దుచేసి హక్కులను రక్షిస్తాయి.

4. ప్రొహిబిషన్:

దిగువ న్యాయస్థానం అధికార పరిధిని, సహజ న్యాయసూత్రాలను మీరినపుడు, ప్రాథమిక హక్కులకు భంగం కలిగించిన

పుడు.. వాటి విచారణను నిలిపివేపేయాలిని ఈ రిట్ ద్వారా ఉన్నత న్యాయస్థానం ఆదేశిస్తుంది. సెర్షియోరరి ద్వారా విచారణ పూర్తయిన కేసులు, ప్రొహిబిషన్ ద్వారా ప్రస్తుతం విచారణ జరుగుతున్న కేసుల్లో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేస్తుంది. అయితే ఈ రెండు రిట్లను ప్రైవేట్ వ్యక్తులపై లేదా సంఘాలపై జారీ చేయడం సాధ్యం కాదు.

5. కోవారెంటో:

ఏదైనా ప్రభుత్వ సంస్థలో పదవి నిర్వహిస్తున్న వ్యక్తిని అందుకు తగిన అధికారాన్ని చూపమని ఈ రిట్ ద్వారా న్యాయస్థానం ఆదేశిస్తుంది. అనుమతి, అధికారం లేని వ్యక్తులు పదవులు చేపట్ట కుండా ఇది నిరోధిస్తుంది. దీన్ని ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థలపై జారీ చేయడం సాధ్యం కాదు. అందుబాటులో ఉన్న రికార్డులన్నీ పరిశీలించిన తర్వాత న్యాయస్థానం తన విచక్షణ మేరకు మాత్ర మే దీన్ని ఉపయోగిస్తుంది.

అభాగ్యులు, ఆశక్తులు, అన్నార్తులు సైతం న్యాయం పొందేలా చూడటానికి న్యాయస్థానాలు చొరవ ప్రదర్శించి, బ్రిటిష్ కాలం నాటి న్యాయ ప్రక్రియల్లో మార్పులకు శ్రీకారం చుట్టాయి. 80వ దశాబ్దంలో ఊపందుకున్న ఈ సరళీకరణ వల్ల లోకస్ స్టాండి భావన విస్తరించి, సామాజిక స్పృహ ఉన్న ఏ పౌరుడైనా ఇతరుల ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా న్యాయస్థానాలను ఆశ్రయించే వీలు కలిగింది. కొనసాగే మాండమస్ ద్వారా తమ ఆదేశాలను నిరంతరం పర్యవేక్షించడం, విచారణ కమిషనర్ల ద్వారా నిజానిజాలను నిగ్గుదేల్చడం, ప్రాథమిక హక్కులకు భంగం కలిగించిన వారికి శిక్షలతో పాటు బాధితులకు పరిహారం అందించడం, ప్రాథమిక హక్కులను రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు అనుగుణంగా విస్తృతపరచడం మొదలైనవన్నీ న్యాయవ్యవస్థ క్రియాశీలత, ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా సాధ్యమైనవే.

ప్రపంచ మానవహక్కుల చరిత్రలోని అనేక ఘట్టాలైన మాగ్నాకార్టా, అమెరికా స్వాతంత్ర్య ప్రకటన, ఫ్రెంచి విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, రష్యావిప్లవ స్ఫూర్తి, 1948 ఐక్యరాజ్య సమితి మావనహక్కుల ప్రకటనతో ప్రభావితమైన మన రాజ్యాంగ నిర్మాతలు భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో ప్రాథమిక హక్కులు పొందుపరిచారు.

ప్రధానంగా అమెరికా రాజ్యాంగంలోని ''బిల్ ఆఫ్ రైట్స్''తో ప్రభావితమై భావిభారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా ప్రాథమిక హక్కులను రూపొందించారు. మన రాజ్యాంగానికి 'మాగ్నాకార్టా' వంటిదిగా ప్రాథమిక హక్కులను వర్ణిస్తారు.

1. ప్రాథమిక హక్కులు ప్రధానంగా ఏ ఉద్దేశంతో రూపొందించారు?

ఎ) ఆర్థిక సమానత్వం బి) సామాజిక ప్రజాస్వామ్యం
సి) రాజకీయ ప్రజాస్వామ్యం డి) శ్రేయోరాజ్య స్థాపన

సమాధానం: (సి)

వివరణ: ప్రాథమిక హక్కులు వ్యక్తి స్వేచ్ఛకు, రాజకీయ ప్రజాస్వామ్యానికి ఉద్దేశించినవి. నిర్దేశిక నియమాలు, ఆర్థిక సమానత్వం, సామాజిక ప్రజాస్వామ్యం శ్రేయోరాజ్య స్థాపనకు ఉద్దేశించినవి.

2. భారత రాజ్యాంగంలోని ఏ భాగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు? (గ్రూప్ II-2008)

ఎ) III బి) II సి) IV డి) I

సమాధానం: ఎ

3. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ప్రసుతం ఎన్ని గ్రూపులుగా విభజించొచ్చు? (గ్రూప్ II-2008)

ఎ) 7 బి) 8 సి) 6 డి) 5

సమాధానం: (సి)

వివరణ: రాజ్యాంగం అమల్లోకి వచ్చినపుడు హక్కులు 7 ఉండగా 1978లో ఆస్తిహక్కును చట్టబద్ధమైన హక్కుగా మార్చారు. దాంతో ప్రస్తుతం 6 హక్కులు ఉన్నాయి.

4. చట్టం ముందు అందరూ సమానులేనని, వివక్షతకు తావులేదని మన రాజ్యాంగంలోని ఏ నిబంధన తెలుపుతుంది?

ఎ) 21 బి) 18 సి) 14 డి) 22

సమాధానం: (సి)

వివరణ: కుల, మత, జాతి, వర్గ, స్త్రీ, పురుష వివక్షత చూపరాదు. చట్టం ముందు అందరూ సమానులే అనే అంశాన్ని 14వ అధికరణ తెలుపుతోంది.

5. కింది వాటిలో ఏ హక్కును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ ఆత్మగా భావించారు?

ఎ) వాక్ స్వాతంత్ర్యం బి) రాజ్యాంగ పరిహార
సి) సమానత్వం డి) మత స్వాతంత్ర్యం

సమాధానం: (బి)

వివరణ: ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే రాజ్యాంగ పరిహార హక్కును భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం వంటిదిగా డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వర్ణించారు.

6. భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ 14 ఏళ్లలోపు పిల్లలు కర్మాగారం, గనులు లేదా ఇతర ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేయరాదని పేర్కొంటోంది? (సివిల్స్-2004)

ఎ) 24 బి) 45 సి) 330 డి) 368

సమాధానం: (ఎ)

7. ఒక వ్యక్తి నిర్బంధం చట్టబద్ధమైందా లేదా అని విచారించడానికి ప్రభుత్వం అమలు చేసే న్యాయబద్ధమైన పరిహారం? (గ్రూప్ I - 1999)

ఎ) హెబియస్ కార్పస్ బి) సెర్షియరి
సి) మాండమస్ డి) కోవారెంటో

సమాధానం: (ఎ)

వివరణ: అరెస్ట్ అయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీపంలోని కోర్టు ముందు హాజరు పరచాలని, ఆ వ్యక్తి నిర్బంధం చట్టబద్ధమైందా? కాదా? అని విచారించడానికి ఉన్నత, న్యాయస్థానాలు జారీచేసే రిట్‌ను హెబియస్ కార్పస్ అంటారు.

8. సుప్రీంకోర్టుకు కింది కేసుల్లో ఆస్తి హక్కుతో సంబంధం లేనిది? (గ్రూపు I - 2004)

ఎ) ఎ.కె. గోపాలన్ vs. కేరళ రాష్ట్రం
బి) గోలక్‌నాథ్ సి) కేశవానంద భారతి
డి) మినర్వా మిల్

సమాధానం: (ఎ)

వివరణ: 1951లో సుప్రీంకోర్టు ఎ.కె. గోపాలన్ vs. కేరళ రాష్ట్రం మధ్య జరిగిన వ్యాజ్యంలో ఇచ్చిన తీర్పు వ్యక్తిస్వేచ్ఛ స్వాతంత్ర్యపు హక్కుకు సంబంధించింది. మిగతా కేసులన్నీ ఆస్తిహక్కుకు సంబంధించిన కేసులుగానే పేర్కొంటాం.

9. ప్రాథమిక హక్కుల చాప్టర్‌లో సాంస్కృతిక, విద్యా హక్కుల ఉద్దేశం? (APRO's 2008)

ఎ) నిరక్షరాస్యతను రూపుమాపడం
బి) ఒకే సంస్కృతిని రూపొందించడం
సి) అల్పసంఖ్యాకవర్గాల సంస్కృతి సంరక్షణకు సహాయపడటం
డి) భారతదేశ సంస్కృతి సంరక్షణకు సహాయపడటం

సమాధానం: (సి)

వివరణ: భారతదేశంలో ఏ ప్రాంతంలో నివసించేవారైనా తమ భాష, లిపిని, సంస్కృతి సంరక్షణ, అభివృద్ధి చేసుకోవడానికి అవ కాశం కల్పించే సాంస్కృతిక, విద్యాహక్కు అల్పసంఖ్యాక వర్గాలకు ఉద్దేశించిందిగా పేర్కొనవచ్చు.

10.మతం పేరుతో కొంతమందిని కొన్ని ప్రదేశాల్లో ప్రవేశాన్ని నిరోధిం చకుండా ఉండటం ప్రాథమిక హక్కుల్లో ఏ భాగం కిందకు వస్తుంది? (సివిల్స్-1995)

ఎ) మతస్వేచ్ఛ బి) పీడన నిరోధ హక్కు

సి) సాంస్కృతిక విద్యావిషయ హక్కులు

డి) సమానత్వపు హక్కు

సమాధానం: (డి)

వివరణ: రాజ్యాంగంలోని 15వ అధికరణ మతం పేరుతో కొంత మందిని కొన్ని ప్రదేశాల్లో నిరోధించకుండటం అనేది ప్రాథమిక హక్కుల్లోని సమానత్వపు హక్కులోని అంశం.

11.రాజ్యాంగ సదస్సులో ప్రాథమిక హక్కుల కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరించింది? (ఎంపీడీఓ-1999)

ఎ) సర్ రామస్వామి ముదలియార్

బి) జవహర్‌లాల్ నెహ్రూ

సి) మోతీలాల్ నెహ్రూ

డి) సర్దార్ వల్లభాయ్ పటేల్

సమాధానం: (డి)

వివరణ: రాజ్యాంగ పరిషత్‌లో ప్రాథమిక హక్కుల సలహా కమి టీకి అధ్యక్షులుగా వ్యవహరించినవారు సర్దార్ వల్లభాయ్ పటేల్ కాగా జె.బి.కృపలాని ఉపకమిటీ అధ్యక్షులుగా వ్యవహరించారు.

12.రాజ్యాంగం ఏ అధికరణ ద్వారా పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పిం చింది? (డిప్యూటీ ఈఓ-2008)

ఎ) 14 బి) 21 సి) 32 డి) 19

సమాధానం: (డి)

వివరణ: వాస్తవానికి భారత రాజ్యాంగంలో పత్రికా స్వాతంత్ర్యా నికి సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదు. కానీ 19వ అధికరణ లోని వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ ద్వారా మాత్రమే పత్రికా స్వాతంత్ర్యాన్ని కల్పించారు.

13. ప్రాథమిక హక్కుల అమలుకు న్యాయస్థానాలు జారీ చేసేది? (జూనియర్ అసిస్టెంట్-2007)

ఎ) డిక్రీ బి) రిట్

సి) నోటిఫికేషన్స్ డి) ఆర్డినెన్స్‌లు

సమాధానం: (బి)

వివరణ: ప్రాథమిక హక్కుల సంరక్షణ, వాటి అమలు కోసం ఉన్నత న్యాయ స్థానాలైన సుప్రీంకోర్టు, హైకోర్ట్‌లు ఐదు రకాలైన రిట్లు జారీ చేస్తాయి.

14. ఏ రాజ్యాంగ అధికరణంలో 'భారతరత్న', పద్మశ్రీ పురస్కారాలు ప్రవేశపెట్టారు? (గెజిటెడ్-2006)

ఎ) 14 బి) 18 సి) 25 డి) 31

సమాధానం: (బి)

వివరణ: రాజ్యాంగంలోని 18వ అధికరణ. విదేశీ, స్వదేశీ బిరు దులను నిషేధిస్తుంది. విద్య, సైనిక రంగాలను మినహాయించారు. అయితే పౌర పురస్కారాలను, విశిష్ట సేవలందించిన వారికి ఇచ్చే భారతరత్న, పద్మశ్రీ లాంటి పురస్కారాలను 1954లో ప్రవేశపె ట్టారు.

15.భారత రాజ్యాంగం ఏ భాగంలో ''చింతన'' భావప్రకటన, విశ్వా సం, నమ్మకం, ప్రార్థనా స్వేచ్ఛ అనే పదాలను ఊటంకించారు? (గ్రూపు II - 2000)

ఎ) రెండో బి) ఆదేశిక సూత్రాలు

సి) పీఠిక డి) కేంద్ర న్యాయస్థానం

సమాధానం: (సి)

వివరణ: రాజ్యాంగ ప్రవేశికలోని స్వేచ్ఛ అనే పదం ఆలోచన, విశ్వాసం, నమ్మకం, ఆరాధ నలోస్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కల్పి స్తుందని పేర్కొంటుంది.

16.ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు మధ్య విరోధానికి కారణం? (గ్రూప్-I, 1994)

ఎ) లిఖిత రాజ్యాంగం బి) రాజ్యాంగ స్పష్టత

సి) సాంఘిక, ఆర్థిక అసమానత

డి) ముందుచూపున్న నాయకులు లేకపోవడం

సమాధానం: (సి)

వివరణ: భారతదేశంలోని ఆర్థిక, సాంఘిక అసమానతలను రూపుమాపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొం దిస్తున్నాయి. ప్రాథమిక హక్కులకు విరుద్ధంఅనే కారణంతో ఈ చట్టాలను న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాయి. 1969 లో బ్యాంకుల జాతీయీకరణ, 1970లో రాజభరణాల రద్దును సుప్రీంకోర్టు కొట్టివేసింది.

17. కింది వాటిలో ప్రాథమిక హక్కులు ఏవి?

1) అసోసియేషన్లు, యూనియన్లు ఏర్పరచు కునే స్వేచ్ఛ

2) సంస్కృతి, భాష మొదలైన వాటిని పరిరక్షించుకునే స్వేచ్ఛ

3) తగిన జీవనాధారాన్ని కలిగి ఉండే హక్కు

4) సమాన, ఉచిత న్యాయ సహాయం పొందడం.

ఎ) 1, 2 బి) 2, 3 సి) 3, 4 డి) 1, 2

సమాధానం: (డి)

వివరణ: సంఘాలు, సంస్థలు స్థాపించుకునే హక్కు, సంస్కృతి, భాష మొదలైన వాటిని సంరక్షించుకునే స్వేచ్ఛ ప్రాథమిక హక్కు లు కాగా జీవనోపాధి, ఉచిత న్యాయాన్ని పొందడం రాజ్యాంగం లోని ఆదేశిక సూత్రాలు.

18.కింది వాటిలో పౌరులకు మాత్రమే వర్తించే హక్కు?

ఎ) చట్టం ముందు అందరూ సమానులే

బి) చట్టం అందరికీ సమాన అవకాశాలను కల్పిస్తుంది

సి) పీడనాన్ని నిరోధించే హక్కు

డి) మత స్వాతంత్ర్యపు హక్కు

సమాధానం: (బి)

వివరణ: చట్టం ముందు అందరినీ సమానులుగా పరిగణించడం, పీడనం నుంచి నిరోధించే హక్కు, మత స్వాతంత్ర్యం కేవలం పౌరులకు మాత్రమే కాక విదేశీయులకు కూడా లభిస్తాయి. కానీ పబ్లిక్ రంగంలో చట్టం అందరికీ సమాన అవకాశాలను కల్పించడం పౌరులకు మాత్రమే లభించే హక్కు.

19.నివారక నిర్బంధ చట్టాలను రూపొందించే అధికారం ఎవరికి ఉంది?

ఎ) కేంద్ర ప్రభుత్వం　　బి) రాష్ట్ర ప్రభుత్వం

సి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు　　డి) భారత రాష్ట్రపతి

సమాధానం: (సి)

వివరణ: నివారక నిర్బంధ చట్టాలను రూపొందించే అధికారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికీ ఉంటాయి. ESMA, NASA చట్టాలను కేంద్రం రూపొందిస్తే COCA వంటి వాటిని రాష్ట్రాలు రూపొందించుకున్నాయి.